తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌తో కోలేటి దామోదర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన 'కోలేటి '

గోదావరిఖని, ఫిబ్రవరి 11: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం ఎర్రవెల్లిలోని నివాసంలో కేసీఆర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు కోలేటి దామోదర్ తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పాలకుర్తి, ఫిబ్రవరి22: కుక్కలగూడూర్,బసంత్‌నగర్, పాలకుర్తిలోని ఎరువుల దుకాణాలను ఏవో బీ ప్రమోద్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాముల్లో ఉన్న ఎరువులు, స్టాక్ రిజిష్టర్‌లో ఉన్న వివరాలు పరిశీలించారు.

ముత్తారం, ఫిబ్రవరి11 : అడవి శ్రీరాంపూర్, మచ్చుపేట, ముత్తారంలోని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాలను ఏవో అనూష మంగళవారం తనిఖీ చేశారు. ఎరువులను నిర్ణీత ధరకే విక్రయించాలని సూచించారు.

యూరియా నిల్వలు తనిఖీ

జూలపల్లి, ఫిబ్రవరి 11: జూలపల్లి సింగిల్ విండో, తేలుకుంటలో ఏవో ప్రత్యూష యూరియా నిల్వలు తనిఖీ చేశారు. సింగిల్ విండోలో 40 టన్నులు, తేలుకుంట, వడ్కాపూర్‌లోని ప్రైవేట్ దుకాణాల్లో 51 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

పల్లె దవాఖానలో సేవలు ప్రారంభం

- 'నమస్తే' కథనానికి స్పందన

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది

మంథని రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని చిల్లపల్లిలోని పల్లె దవాఖానపై 'ప్రారంభోత్సవానికే పరిమితం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. పల్లె దవాఖానలో మంగళవారం ఓపీ సేవలను ప్రారంభించారు. చిల్లపల్లిలోని పల్లె దవాఖానలో కరెంట్, నీటి సౌకర్యం కల్పించక ముందే ఈ హాస్పిటల్ ప్రారంభోత్సవం చేశారు. వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపించారు. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి ఓపీ సేవలను ప్రారంభించినట్లు డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి తెలిపారు. కాగా సుమారు 30 వరకు ఓపీలు చూసినట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పల్లె దవాఖానలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రీజ అందుబాటులో ఉంటారని తెలిపారు. సాయంత్రం 4గంటల వరకు సిరిపురం, దుబ్బపల్లి, బెస్తపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో డీఐవో బండి కిరణ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నెలాఖరులోగా ఏటీసీ భవన నిర్మాణం పూర్తి చేయాలి

- లేబర్ ఎంప్లాయిమెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్

ఏటీసీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న లేబర్ ఎంప్లాయిమెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ

పెద్దపల్లి, ఫిబ్రవరి11: పెద్దపల్లి ఐటీఐ సెంటర్ ప్రాంగణంలో చేపట్టిన ఏటీసీ భవన నిర్మాణ పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని లేబర్, ఎంప్లాయిమెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలోని ఏటీసీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ మాట్లాడారు. ఆరు ట్రేడ్లతో యువతకు ఉపాధి శిక్షణ అందించేందుకు ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) భవన నిర్మాణ పనులు నాణ్యతగా, వేగవంతంగా, నిర్దేశిత సమయంలో చేయాలని ఆదేశించారు. ఐటీఐలో అందుతున్న శిక్షణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఐటీఐ సెంటర్ విద్యుత్ బకాయిలు రూ. 15. 80 లక్షలు త్వరలో మంజూరు చేస్తామన్నారు ప్రహరీ మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అనంతరం ఏటీసీ సెంటర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి వెంకటరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

రౌతు రితీష

ముత్తారం, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ ఎంఎంఎస్ జాతీయ స్థాయి ఉపకార వేతనాలకు మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థినికి రౌతు రితీష ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్ కుమార్ తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు ఏటా రూ. 12 వేలు ఉపకార వేతనంగా అందజేస్తారని వెల్లడించారు.విద్యార్థి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: ఎన్ఎంఎంఎస్ 2024-25 ఫలితాల్లో గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు సాకేత్, అర్షిత, సాయిచరణ్, వర్షిణి ప్రతిభను చూపి ఉపకార వేతనాలకు అర్హత సాధించడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ కొండయ్య తెలిపారు.

ఇక్కడ బీసీ లీడర్లకు నో టెన్షన్

- రెండు గ్రామాల్లో అందరూ వెనుకబడిన సామాజిక వర్గాలే..
- యాదవులు, మున్నూరు కాపులదే ఆధిపత్యం
- తమకు రిజర్వేషన్ అనుకూలిస్తుందంటూ నాయకుల చర్చలు

బాలరాజ్‌పల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

జూలపల్లి, ఫిబ్రవరి 11 : ఆ రెండు ఊళ్లల్లో అందరూ బీసీలే. ప్రతి 'స్థానిక' ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాల వారే పదవులన్నీ అనుభవిస్తుంటారు. పంచాయతీ పదవుల కోసం ఆ రెండు కులాలే ప్రధానంగా పోటీ పడుతుంటాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది రిజర్వేషన్ల స్పష్టతపై గ్రామాల్లో ఉత్కంఠంగా ఎదురు చూస్తుంటారు. సర్పంచ్, వార్డు పదవుల పంపకంపై ఎక్కడ చూసినా రిజర్వేషన్లపై జోరుగా చర్చ జరుగుతుంది. ఏ ఊరిలో ఏ వర్గానికి రిజర్వేషన్ కల్పిస్తారోనని సాధారణంగా లెక్కలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ రెండు గ్రామాల్లో రిజర్వేషన్ల కేటాయింపుపై చర్చా ఉండదు. ఓటర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు లెక్కలు వేసుకోరు. అందుకే అక్కడి ఓటర్లలో ఏ టెన్షన్ ఉండదు. జూలపల్లి మండలం వడ్కాపూర్ పరిధి నుంచి ఆరేండ్ల క్రితం ప్రత్యేక జీపీలుగా ఏర్పడ్డాయి. బాలరాజ్‌పల్లిలో మొత్తం 650 మంది జనాభాలో 425 మంది ఓటర్లు ఉన్నారు. కీచులాటపల్లిలో మొత్తం 638 మంది జనాభాలో 355 మంది ఓటర్లున్నారు. ఇక్కడ మున్నూరు కాపు, యాదవులు అత్యధిక శాతం ఉన్నారు. రజక, పద్మశాలీ, ముదిరాజ్, కులాలకు చెందిన వారు అత్యల్పంగా ఉన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, రెడ్డి సామాజిక వర్గాల ఓటర్లు అసలే లేకపోవడం గమనార్హం. దీంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సంఘం బీసీ రిజర్వేషన్ అమలు చేయడం అనివార్యమవుతున్నది. పంచాయతీ పదవులన్నీ బీసీలనే వరించడం ఆనవాయితీగా వస్తున్నది. బీసీ రిజర్వేషన్‌లో మహిళకు కేటాయిస్తారా లేదా, పురుషులకు కేటాయిస్తారా? అనే దానిపై గ్రామస్తులు చర్చించుకోవడం కొసమెరుపు. కాగా ఈ విషయమై ఎంపీవో అనిల్ రెడ్డిని సంప్రదించగా ఈ రెండు గ్రామాల్లో రిజర్వేషన్ బీసీలకే కేటాయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పుట్ట శైలజకు సన్మానం

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు

మంథని, ఫిబ్రవరి 11: మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. మంథనిలోని రాజగృహలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో శైలజతో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేయించారు. స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్, శైలజలను గజమాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పుట్ట శైలజకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పసివాడి వైద్యానికి చేయూత

నగదు అందజేస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు చంద్రకళ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11: రెండు కిడ్నీల ఎదుగుదల లేక అనారోగ్యంతో బాధపడుతున్న పసివాడి వైద్యానికి ఎన్టీపీసీ శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు చేయూత అందించారు. గోదావరిఖని బస్టాండ్ కాలనీకి చెందిన దోనుగు రవీంద్ర-సృజన దంపతుల కుమారుడు హర్షవర్ధన్(9)కు రెండు కిడ్నీలు ఎదుగుదల లేక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ సామాజిక మాధ్యమం ద్వారా దాతల సాయం కోరింది. మంగళవారం బాబు తల్లి సృజనను కలిసి రూ.5వేలు సాయం అందజేశారు. హర్షవర్ధన్‌కు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందనీ, తన కిడ్నీని ఇవ్వడానికి ముందుకు వచ్చిన తల్లికి ఆపరేషన్ కోసం చేతిలో డబ్బులు లేక తల్లడిల్లుతున్నారు. దాతలు ముందుకు వచ్చి పెద్ద మొత్తంలో ఆ బాబు ఆపరేషన్‌కు సాయం అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మానవతావాదులపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు కంది సుజాత, బిల్లా శ్రీదేవి, కొండు రమ, జనగామ రాజేశ్వరి ఉన్నారు.

కార్మికులకు శుద్ధ జలం అందించాలి

ఆర్జీ-2 జీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 11 : ఆర్జీ-2 ఏరియాలోని కార్మికులు, కార్మిక కుటుంబాలకు శుద్ధ జలం అందించాలని టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఏరియా జీఎం బండి వెంకటయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ప్రస్తుతం కలుషితమైన నీటి సరఫరాతో పాటు రెండు రోజులకో సారి కార్మిక కుటుంబాలకు నీటిని సరఫరా చేస్తున్నారని గుర్తు చేశారు. దీంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని వివరించారు. క్రీడా మైదానంలో తాగు నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలులో ఆరు అతిథి గృహాలను నిర్మించాలని కోరారు. కోల్ కారిడార్ రోడ్డు అధ్వానంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు ప్రభాకర్ రెడ్డి, బేతి చంద్రయ్య, అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, కూర తిరుపతి, ముస్కుల అనిల్ రెడ్డి, బేతి రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీకాంత్, కమలాకర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్లుగా ఏపీఏ జీఎంలు

కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి ఫిబ్రవరి 11 : ఏపీఏ ఏరియాకు జీఎంలుగా బాధ్యతలు చేపట్టిన వారంతా డైరెక్టర్లుగా ఉన్నత స్థాయికి ఎంపిక కావడం కార్మిక వర్గం విశేషంగా భావిస్తున్నారు. సింగరేణిలో డైరెక్టర్ల పదవులకు జరుగుతున్న ఎంపిక పరీక్షల్లో ఏపీఏకు జీఎంలుగా పని చేసిన వారు తమ ప్రతిభతో డైరెక్టర్ (ఆపరేషన్) డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వంటి హోదాను సాధించడం విశేషం. ఏపీఏ (అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ఏరియా)కు జీఎంలుగా పని చేసిన బీ భాస్కర్‌రావు డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్స్), ఎన్.చంద్రశేఖర్ డైరెక్టర్ (ఆపరేషన్స్) బీ వీరారెడ్డి 2019 ఆగస్టు 28న నిర్వహించిన ఈసీఎల్ (ఈస్టరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్) డైరెక్టర్ (టెక్నికల్)గా ఎంపిక య్యారు. అనంతరం ఏపీఏకు జీఎం గా విధులు కొనసాగిస్తున్న ఎన్వీకే శ్రీనివాస్ 2023 జనవరి 31న డైరెక్టర్ (ఆపరేషన్స్)గా హోదాను సాధించారు. ఆయన స్థానంలో జీఎంగా కొలువుదీరిన కొప్పుల వెంకటేశ్వర్లు ఈ నెల 10న డైరెక్టర్ నియామకానికి యాజమాన్యం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చూపి డైరెక్టర్ (ఆపరేషన్స్)గా ఎంపికైనట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు వరుసగా అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ఏరియాకు జీఎంలుగా పని చేసిన ఐదుగురు సింగరేణిలో డైరెక్టర్లుగా నియమితులు కావడం విశేషం.

కూరగాయల విక్రయిస్తూ.. కుప్పకూలిన వృద్ధురాలు

మంథని, ఫిబ్రవరి 11: కూరగాయలు విక్రయిస్తున్న ఓ వృద్ధురాలు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన మంథనిలోని అంబేద్కర్ రాస్తాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన చీర్ల శంకరమ్మ (60)కు భర్త రాజయ్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు చేశారు. జీవనోపాధిలో భాగంగా తమ పొలంలో పండించిన కూరగాయలను మంథనికి తీసుకువచ్చి విక్రయిస్తున్నది. మంగళవారం సైతం కూరగాయలు మంథనికి తీసుకు వచ్చి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో హమాలీ సంఘం ఎదురుగా విక్రయానికి కూర్చుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాగానే ఉన్న శంకరమ్మ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఆమెతో ఉన్న మరో వృద్ధురాలు గమనించి స్థానికు లను పిలిచింది. వారు 108కు సమాచారం అందించగా, సిబ్బంది ఆమెను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు పక్కనే ఉన్న వారితో మాట్లాడుతూ కూరగాయలు విక్రయిస్తున్న వృద్ధురాలు ఒక్కసారిగా ఇలా కుప్పకూలి మృతి చెందిన తీరు అందరినీ ఎంతగానో కలిసి వేసింది.

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి

కొయ్యడ రాజయ్య(ఫైల్)

కమాన్‌పూర్/జ్యోతినగర్, ఫిబ్రవరి 11: కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంటకు చెందిన నిరుపేద గొర్రెల కాపరి కొయ్యడ రాజయ్య(53) సోమవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి లక్ష్మీపురం శివారులో గొర్లను మేపేందుకు మంద ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో మంద ఏర్పాటు చేసుకున్న ప్రదేశం పక్కన నేలపై సదరు గొర్ల కాపరి నిద్రించగా కాలికి పాము కాటు వేయడంతో నిద్రమత్తులో ప్రాణాలు వదిలాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజయ్య మృతదేహాన్ని పోలీసులు గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు పోస్టు మార్టం కోసం తరలించారు. రాజయ్యకు భార్య స్వరూప, కుమారులు రమేశ్, సంజీవ్ ఉన్నారు. మృతుడి చిన్నకొడుకు ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కొడుకు, భార్యపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 11: కన్న కొడుకు, భార్యను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి హత్యాయత్నం చేసిన మడిపల్లి ఉదయ్‌కుమార్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం వన్‌టౌన్‌లో సీఐ ఇంద్రసేనారెడ్డి అరెస్టు వివరాలు వెల్లడించారు. గోదావరిఖని గంగానగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి ఉదయ్‌కుమార్ 2022లో అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కొడుకు ఉన్నాడు. అనంతరం భార్యభర్తల మధ్య మనస్పర్థలతో ఇరువురు దూరంగా ఉంటున్నారు. అనూష కొడుకుతో కలిసి స్థానిక జీఎం కాలనీలో తన పుట్టింట్లో ఉంటున్నది. భర్త వేధింపులపై అనూష వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోకేసు పెట్టింది. ఈ క్రమంలో ఈ నెల 9న ఉదయ్‌కుమార్ తన బైక్‌తో జీఎం కాలనీకి వచ్చిన భార్య, కొడుకును బైక్‌తో ఢీకొట్టి హత్యకు యత్నించాడు. చుట్టపక్కల వారు అడ్డుకోవడంతో తప్పించుకొని పారిపోయాడు. అనూష ఫిర్యాదు మేరకు ఉదయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న కారు, బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇక్కడ ఎస్ఐ భూమేశ్ ఉన్నారు.

షీటీమ్‌పై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 11: గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం షీటీమ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. షీటీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎక్కడైన మహిళలు, విద్యార్థినీలు వేధింపులకు గురైతే 6303923700 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఇక్కడ షీటీమ్ సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుశీల, విద్యార్థినులు ఉన్నారు.

'కాళేశ్వరం' భూముల్లో సాగు చేస్తున్నారని ఫిర్యాదు

బోర్లు వేసి సాగు చేస్తున్న వరి పంట

మంథని, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం సరస్వతీ బ్యారేజీకి సంబంధించిన భూముల్లో మంథని మండలం ఆరెంద, మల్లారం గ్రామాలకు చెందిన కొంత మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. బ్యారేజీ కింద ముంపు ప్రాంతాలుగా వ్యవసాయ భూములకు రైతులు నష్ట పోవద్దనే సదుద్దేశంతో ప్రభుత్వం పరిహారం అందించి భూములను స్వాధీనం చేసుకొని హద్దులు సైతం ఏర్పాటు చేసింది. కొంత మంది రైతులు ఆ హద్దు బండలను తొలగించి ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న భూముల్లో వరి పంటలు సాగు చేస్తున్నారు. కొంత మంది రైతులు ఏకంగా బోర్లు సైతం వేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. అన్నారం సరస్వతీ బ్యారేజీ కింద ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న భూముల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను అన్నారం బ్యారేజీ ఏఈ వెంకన్న పరిశీలించి డీఈ సతీశ్‌కు నివేదిక అందించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల్లో పంటలు సాగు చేస్తున్న 12 మంది రైతులపై చర్యలు తీసుకోవాలని మంథని ఆర్డీవో సురేశ్, మంథని తహసీల్దార్, మంథని సీఐలకు, విద్యుత్ కనెక్షన్లు సైతం తొలగించాలని కోరుతూ విద్యుత్ శాఖ డీఈకి ఫిర్యాదు చేశారు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 : ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సుల్తానాబాద్ మండల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను మంగళవారం ఎంపీడీవో దివ్యాదర్శన్‌రావు విడుదల చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి బోర్డుపై అతికించారు. మండలంలో 13 ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ స్థానానికి గానూ 74 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పురుష ఓటర్లు 19167, మహిళా ఓటర్లు 19943 మంది, ఇతరులు ఒకరితో కలిసి మొత్తం 39111 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లపై అభ్యంతరాలుంటే ఈనెల 13లోగా రాతపూర్వకంగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈనెల 13న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఉంటుందని, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందజేయాలని తెలిపారు.

టీబీ వ్యాధిపై అవగాహన

ముత్తారం, ఫిబ్రవరి 11: మచ్చుపేట సబ్ సెంటర్ పరిధిలోని మచ్చుపేట, లక్కారం గ్రామాల్లో ప్రజలకు టీబీపై ముత్తారం వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. టీబీ ఏ విధంగా వస్తుంది, వ్యాధిని గుర్తించడం, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పలువురికి వైద్య పరీక్షలు చేశారు. టీబీని అంతం చేయాలనే ఉద్దేశంతోనే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఇక్కడ పబ్లిక్ హెల్త్‌నర్స్ గ్రేసీమణి, బొల్లం దీప్తి, హెల్త్ అసిస్టెంట్ ఎం శ్రీనివాస్, ఏఎన్ఎం పుష్పలత, ఎస్‌టీఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

గోదావరిఖని, ఫిబ్రవరి 11: పట్టణంలోని ఈశ్వరకృపా వృద్ధాశ్రమాన్ని సీఎంపీఎఫ్ రామగుండం ఏరియా రీజినల్ కమిషనర్ పచోరీ మంగళవారం సందర్శించారు. వృద్ధులతో కాసేపు ఆయన మాట్లాడారు. అనంతరం కమిషనర్ వారి తల్లిదండ్రుల పేరిట ఆశ్రమంకు 15లీటర్ల గీజర్ వితరణ చేశారు. ఇక్కడ వృద్ధాశ్రమం అధ్యక్షుడు పీటీ స్వామి, డైరెక్టర్లు గంట సత్తయ్య, జాక సత్యనారాయణ, సీతారాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సింగరేణి డైరెక్టర్లకు టీబీజీకేఎస్ సన్మానం

డైరెక్టర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామగిరి, ఫిబ్రవరి 11: సింగరేణి సంస్థలో నూతనంగా ఎంపికైన ఇద్దరు డైరెక్టర్లను టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మంగళవారం సన్మానించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ప్రధాన కార్యాలయంలో నూతన డైరెక్టర్లు సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లును కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణిలో నెలకొన్న ప్రస్తుత విపత్కర పరిస్థితులు, కష్టకాలంలో ఉన్న పరిణామాలను కొత్త డైరెక్టర్లకు ఉన్న అపార అనుభవంతో నైపుణ్యంతో అధిగమించి సంస్థ పురోభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఆయన వెంట డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, బోయినపల్లి శ్రీకాంత రావు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

ముత్తారం, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో మానేరు వాగు నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. ఇటీవల ముత్తారం మండలంలో రెండు ఇసుక రీచ్‌లలో ఉచితంగా ఇసుక రవాణా చేసుకోవచ్చని ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిసుండడంతో రహదారికి ఇరువైపులా ఉన్న వ్యవసాయ పొలాలు దుమ్ము, ధూళితో దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పై రోజు నీటిని చల్లాలని తెలిపినా యజమానులు పట్టించుకోకపోవడంతో మంగళవారం ముత్తారం రైతులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఇరువురితో మాట్లాడారు. రోడ్డుపై నీరు చల్లిస్తామని ట్రాక్టర్ యజమానులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు

మాక్ ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

గోదావరిఖని, ఫిబ్రవరి 11: సివిల్స్ సర్వీసెస్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం, మెయిన్స్‌లో విజయం సాధించిన వారికి మరో లక్ష రూపాయల ప్రోత్సాహం అందిస్తున్నది. ఇంటర్వూలకు ఎంపికైన వారికి మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని ప్రభుత్వ ఆదేశాలలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మార్గదర్శకత్వంలో సీనియర్ అధికారుల నేతృత్వంలో నమూనా మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలో ఒక్కో అభ్యర్థిని వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం తుది ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి అంశంపై పలు కీలక సూచనలు చేశారు. అలాగే అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు 15 రోజులుగా నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ప్యానెల్ సభ్యులుగా ఇంటర్వ్యూలు చేస్తు న్నారు. మంగళవారం ఇంటర్వ్యూలు చేసిన వారిలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు

పెద్దపల్లి, ఫిబ్రవరి11: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని, జిల్లా పరిధిలో ఈనెలలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 280.58 మెగావాట్లు నమోదైందని విద్యుత్ శాఖ పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న 5.02 మిలియన్ యూనిట్లు నమోదైనట్లు వెల్లడించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వేసవి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, అందులో భాగంగా 27 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 65 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామని, 92 ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సబ్ స్టేషన్లలో 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతూ, 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో గాని, మెయింటెనెన్స్ సమయంలో గాని, ఇతర కారణాలతో గాని ఒక లైన్‌లో లేదా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన/నిలుపవలసిన సమయంలో ఆయా లైను లేదా సబ్ స్టేషన్ పరిధిలోగల విద్యుత్ వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైను(ఇంటర్ లింకు లైన్) ద్వారా కరెంట్ సరఫరా చేసేందుకు కొత్తగా 15 ఇంటర్ లింకింగ్ లైన్లను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేపట్టామని, వాటిలో 4 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. నెలాఖరు వరకు మిగతా పనులను పూర్తి చేస్తామని తెలిపారు.